సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 11 । సెప్టెంబర్ । 2025



పాఠశాలలకు ప్రోత్సాహకాలు

పరిశుభ్రత, హరిత వాతావరణం ప్రామాణికాలుగా ప్రభుత్వ పాఠశాలలకు కేంద్రం నగదు ప్రోత్సాహకాలు ఇవ్వనుంది. 8లో



కోలాహలంగా 'కేటీపీఎస్' ఎన్నికలు

కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ (పాల్వంచ) ఎన్నికలు బుధవారం కోలాహలంగా జరిగాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
31° / 24°

జిల్లాలో గురువారం ఉదయం జల్లులు పడతాయి. మధ్యాహ్నం పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి: వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రాంతీయ ఆస్పత్రులు మణుగూరు, ఇల్లెందు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు పాల్వంచ, చర్లలో మత్తు డాక్టర్లు, గైనకాలజీ, రేడియాలజీ, జనరల్‌సర్జన్, పిల్లల వైద్య నిపుణుల పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం ఏడు పోస్టులు ఉన్నాయని, అభ్యర్థులు ఈ నెల 20లోపు కలెక్టరేట్‌లోని సూపరింటెండెంట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు 93472 77353 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

2,680 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా

ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాలకు పంపిణీ

ఖమ్మంవ్యవసాయం: చింతకాని మండలం పందిళ్లపల్లి రైల్వే రేక్ పాయింట్‌కు బుధవారం ఐపీఎల్ కంపెనీకి చెందిన 2,680 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం సరఫరా చేసింది. ఈ ఎరువును ఖమ్మం జిల్లాకు 1,380, భద్రాద్రి జిల్లాకు 800, మహబూబాబాద్ జిల్లాకు 500 మెట్రిక్ టన్నుల చొప్పున పంపిణీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా రైతులకు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వ్యవసాయ శాఖ ద్వారా కూపన్లు జారీ చేసి యూరియా పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేయగా.. పోలీసు పహారాలో అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్

కొత్తగూడెంటౌన్: ఈ నెల నెల 13న జిల్లా కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్ సూచించారు. బుధవారం జిల్లా కోర్టులోని లైబ్రరీహాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో అందరూ సమన్వయంతో పని చేయాలని చెప్పారు. జిల్లాను ఉన్నత స్థానంలో తీసుకొచ్చేందుకు పోలీసు అధికారులు కృషి చేయాలని తెలిపారు.

మునగ సాగుతో ఆదాయం

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు

టేకులపల్లి: మునగ సాగుతో అనేక లాభాలు ఉన్నాయని, రైతులు మునగ సాగుపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన టేకులపల్లిలో మునగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య విలువలు, పోషకాలు, ఔషధ గుణాలు ఉండటం వల్ల మునగకు మార్కెట్‌లో ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఆ తర్వాత శంభునిగూడెంలో డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీని పరిశీలించారు. డ్రోన్ ద్వారా ఎకరానికి రూ. 300తో నానో యూరియా, పురుగుల మందు పిచికారీ చేయవచ్చని, తద్వారా కూలీల ఖర్చు తగ్గించుకోవచ్చని చెప్పారు. డీపీడీ సరిత, ఏఓ నీరుడు అన్నపూర్ణ, ఏఈవోలు శ్రావణి, రమేష్ రైతులు పాల్గొన్నారు.

పరిషత్ ఓటర్లు 6,69,048 మంది

తుది జాబితా వెల్లడించిన అధికారులు

- చివరి దశకు ప్రాదేశిక ఎన్నికల ఏర్పాట్లు
- జిల్లాలో 1,271 పోలింగ్ కేంద్రాలు సిద్ధం



జెడ్పీలో తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తున్న అధికారులు

చుంచుపల్లి: జిల్లాలో జిల్లా, మండల పరిషత్ ఓటర్ల లెక్క తేలింది. మొత్తం 6,69,048 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,25,045 మంది, మహిళలు 3,43,979 మంది, ఇతరులు 24 మంది ఉన్నారు. ఈ మేరకు బుధవారం జెడ్పీ అధికారులు వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 2న జిల్లాలోని 471 గ్రామ పంచాయతీలు, 4,168 వార్డులకు సంబంధించిన ఓటర్ల తుది జాబితా సిద్ధం చేశారు. ఆ ప్రకారమే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఓటర్ల జాబితాపై అధికారులు కసరత్తు చేశారు. గత ఫిబ్రవరిలో ప్రచురించిన జాబితా కంటే ప్రస్తుత జాబితాలో 12,126 మంది ఓటర్లు తగ్గారు. జిల్లాలోని 233 ఎంపీటీసీ స్థానాలు, 22 జెడ్పీటీసీ స్థానాలకు త్వరలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1,271 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తొలుత జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుండగా, ఇప్పటికే ఆర్‌వోలు, ఏఆర్‌వోలకు తొలి విడత శిక్షణ తరగతులు నిర్వహించారు. స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు గతేడాది ఆగస్టు మొదటి వారంతో ముగియటంతో ప్రత్యేకాధికారులను నియమించారు. మండల ప్రజా పరిషత్ పాలనను జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు, జిల్లా పరిషత్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను ప్రత్యేక అధికారులుగా పర్యవేక్షిస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ అది ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతో పరిషత్ ఎన్నికలు కొంత ఆలస్యమవుతాయనే ప్రచారం జరుగుతోంది. దసరా తర్వాత స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

రెండు విడుతలుగా..

జిల్లా, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలకు అధికారులు దాదాపు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల షెడ్యూల్ కోసం ఎదురుచూస్తున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల పరిధిలోని ఓటర్ల జాబితాలను, పోలింగ్ కేంద్రాలపై కసరత్తు చేశారు. ఈ నెల 6న పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల ముసాయిదా జాబితాను మండల, జిల్లా పరిషత్ కార్యాలయాల్లో ప్రదర్శించారు. 6 నుంచి 8 వరకు అభ్యంతరాలు, వినతులను స్వీకరించారు. 8న మండల, జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. 9న అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం జెడ్పీ అధికారులు బుధవారం తుది ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను వెల్లడించారు. త్వరలో జరగనున్న ప్రాదేశిక ఎన్నికలను జిల్లాలో రెండు విడతలుగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని 22 మండలాలకు తొలుత 12 మండలాలు, తర్వాత 10 మండలాలకు పోలింగ్ జరగనుంది.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



జిల్లాలో పరిషత్ ఎన్నికల ఏర్పాట్లు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. 22 జెడ్పీటీసీలు, 233 ఎంపీటీసీలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. తుది ఓటర్ల జాబితాలతో పాటు పోలింగ్ కేంద్రాలను సిద్ధంగా ఉంచాం. ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా పోలింగ్‌కు సిద్ధంగా ఉన్నాం.

–బి.నాగలక్ష్మి, జెడ్పీ సీఈఓ

మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా...

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు
ఆళ్లపల్లి	4,641	4,673	0
అన్నపురెడ్డిపల్లి	8,363	8,569	0
అశ్వాపురం	16,069	17,278	0
అశ్వారావుపేట	14,927	15,770	2
భద్రాచలం	19,624	21,136	1
బూర్గంపాడు	24,676	25,673	2
చంద్రుగొండ	11,640	12,214	1
చర్ల	15,686	16,963	4
చుంచుపల్లి	18,743	19,814	5
దమ్మపేట	21,288	23,255	0
దుమ్ముగూడెం	17,370	19,389	3
గుండాల	6,629	6,701	0
జూలూరుపాడు	13,681	14,303	1
కరకగూడెం	6,393	6,476	0
లక్ష్మీదేవిపల్లి	15,845	16,725	1
మణుగూరు	17,924	18,556	0
ములకలపల్లి	13,887	14,493	0
పాల్వంచ	13,972	14,947	2
పినపాక	13,227	14,122	1
సుజాతనగర్	7,109	7,311	1
టేకులపల్లి	20,677	21,391	0
ఇల్లెందు	22,674	24,220	0

గ్రామాల్లో మళ్లీ 'రెవెన్యూ'

- జిల్లాలో 204 క్లస్టర్లలో జీపీఓల నియామకానికి శ్రీకారం
- గతంలో పనిచేసిన వీఆర్ఓ, వీఆర్ఏలకు అవకాశం
- బలోపేతం కానున్న గ్రామ రెవెన్యూ వ్యవస్థ



నియామక పత్రాన్ని అందుకుంటున్న జీపీఓల అధ్యక్షుడు కాక శ్రీను

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో గ్రామ పాలనకు పునర్వైభవం సంతరించుకోనుంది. గ్రామ పరిపాలనాధికారుల(జీపీఓ)ల నియామకంతో గ్రామస్థాయిలో రెవెన్యూ పాలన పునరుజ్జీవం పోసుకోనుంది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ శాఖలో అవినీతి పెరిగిపోయిందని, దీని కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని 2020లో గత ప్రభుత్వం వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థను రద్దుచేసింది. వీఆర్వో, వీఆర్ఏలను ప్రభుత్వం వివిధ శాఖల్లో సర్దుబాటు చేసింది. దీంతో గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ కనుమరుగైంది. ఏ చిన్న సమస్య తలెత్తినా ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి రావాల్సి వస్తోంది. ఐదేళ్లుగా గ్రామాల్లో ఎక్కడి పనులు అక్కడ స్తంభించాయని భావించిన ప్రస్తుత ప్రభుత్వం తిరిగి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే జీపీఓల నియామకానికి శ్రీకారం చుట్టింది. దీంతో మళ్లీ గ్రామస్థాయిలో ప్రజలకు రెవెన్యూ సేవలు అందనున్నాయి. గతంలో వీఆర్ఓ, వీఆర్ఏలుగా విధులు నిర్వహించిన వారికి కనీస విద్యార్హత ఇంటర్మీడియట్‌గా నిర్ణయించి, ఆసక్తి ఉన్న వారికి అర్హత పరీక్ష నిర్వహించారు. గతంలో జిల్లాలో 329 మంది వీఆర్ఏలు, 247 మంది వీఆర్ఓలు ఉండగా, వారిలో 176 మందిని అర్హులుగా గుర్తించారు. ఇందులో 67 మంది వీఆర్ఏలు, 109 మంది వీఆర్ఓలు ఉన్నారు.

గ్రామస్థాయిలో కీలకం

జీపీఓలు గ్రామస్థాయిలో కీలకంగా మారనున్నారు. భూభారతి, రైతాంగ సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రజలకు అండగా నిలవడం, ఓటర్ల జాబితాలో కీలకంగా వివిధ ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి ప్రాథమిక నివేదికలో విధులను నిర్వహించనున్నారు. ఓటర్ల జాబితా తయారీలో కీలకంగా మారడంతో పాటు ఎన్నికల సమయంలో బీఎల్ఓలుగా వ్యవహరించనున్నారు.

176 మంది ఎంపిక

జిల్లాలోని 23 మండలాల్లో 376 రెవెన్యూ గ్రామాలను 204 క్లస్టర్లుగా నిర్ణయించారు. ఆసక్తి ఉండి పరీక్ష రాసిన 176 మందితో పాటు మరో 18 మందిని అడిషనల్ జీపీఓలుగా ఎంపిక చేశారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఇంకా 10 మందిని జీపీఓలుగా నియమించాల్సి ఉంది. గత సర్వీసును పరిగణనలోకి తీసుకోకుండా జీరో సర్వీసుగా నిర్ణయిస్తారని జరుగుతున్న ప్రచారం కారణంగా కూడా కొందరు జీపీఓలుగా రాకుండా వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది.

అంకితభావంతో సేవలు



గతంలో నిర్వహించిన విధులను తిరిగి నిర్వహించే అదృష్టం రావడం సంతోషంగా ఉంది. ప్రజలకు అవసరమైన సేవలను అంకిత భావంతో అందిస్తాం. మాకు ఈఅవకాశం కల్పించిన ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు.

– కాక శ్రీను, జీపీఓల అధ్యక్షుడు

ప్రజాసమస్యలను తీర్చే అవకాశం



ప్రజలకు గ్రామస్థాయిలో సమస్యలను పరిష్కరించడానికి తిరిగి అవకాశం రావడం పునర్జన్మగా భావిస్తున్నాను. తిరిగి మా విధులను మేము నిర్వహించుకునే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి, అధికారులకు రుణపడి ఉంటాం. శాయశక్తులా ప్రజలకు మా సేవలను పారదర్శకంగా అందిస్తాం.

–పోడెం వరలక్ష్మి, జీపీఓల కోశాధికారి

గ్రామ రెవెన్యూ వ్యవస్థ బలోపేతం



గ్రామరెవెన్యూ వ్యవస్థ బలోపేతమవుతోంది. ప్రజలు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాలకు వ్యయప్రయాసలతో వచ్చే పరిస్థితి ఉండదు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం గ్రామస్థాయిలో జీపీఓల విధులను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం.

–డి.వేణుగోపాల్, అదనపు కలెక్టర్

రాముడి ఆదాయం రూ.1.52 కోట్లు



చిత్రకూట మండపంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

భద్రాచలంలో 72 రోజుల హుండీ కానుకల లెక్కింపు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. ఆలయ ఈఓ దామోదర్ రావు ఆధ్వర్యంలో దేవస్థానంలోని హుండీలను తెరిచి చిత్రకూట మండపానికి తరలించారు. ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు లెక్కింపు చేపట్టారు. 72 రోజులకు రూ.కోటి 52 లక్షల 59 వేల 499ల నగదు, మిశ్రమ బంగారం 0.089 గ్రాములు, మిశ్రమ వెండి కేజీ వచ్చినట్లు ఈఓ తెలిపారు. యూఎస్ డాలర్లు 624, సౌత్రాఫికా ర్యాండ్స్ 450, ఆస్ట్రేలియా డాలర్లు 10, యూఏఈ దిరామ్స్ 10, కెనడా డాలర్లు 230, యూరప్ యూరోలు 30తోపాటు మరికొన్ని ఇతర దేశాల మాదక ద్రవ్యం వచ్చినట్లు వెల్లడించారు. అనంతరం నగదును బ్యాంకర్లకు అందజేశారు. లెక్కింపులో ఆలయ ఏఈవోలు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... కల్యాణం

రామయ్య స్వామివారి నిత్యకల్యాణం బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

ఆకస్మిక వర్షాలపై అప్రమత్తం

జిల్లాలో పలువురి సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: క్లౌడ్ బరస్ట్ తరహాలో కురుస్తున్న భారీ వర్షాలతో రాష్ట్రంలో పలు జిల్లాలు అతలాకుతలం అవుతున్నాయి. దీంతో భారీ వానలకు సంబంధించిన సమాచారాన్ని మొబైల్ ఫోన్లకు మెసేజ్‌ల రూపంలో పంపిస్తూ ప్రజలను ప్రభుత్వం అప్రమత్తం చేస్తోంది. బుధవారం మధ్యాహ్నం జిల్లాలో చాలా మంది ఫోన్లకు వర్షాలకు సంబంధించిన మెసేజ్‌లు వచ్చాయి. రాబోయే మూడు గంటల్లో ఉరుములు మెరుపులతో ఓ మోస్తరు వానలు కురుస్తాయని, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెసేజ్‌లో పేర్కొన్నారు. జిల్లాతోపాటు కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్ జిల్లాల ప్రజలకు కూడా ఈ అలెర్ట్ మెసేజ్‌లు వెళ్లాయి.

మెసేజ్‌లో పేర్కొన్నట్లే వర్షాలు..

తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ)లో ఉన్న మల్టీ ఏజెన్సీ ఆపరేషన్స్ సెంటర్ నుంచి ఈ మెసేజ్‌లు వచ్చాయి. వాతావరణ శాఖ సూచనలకు అనుగుణంగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఆయా జిల్లాల వారీగా ఉన్నతాధికారులు, మున్సిపాలిటీ అధికారులు, విపత్తు నిర్వహణ సంస్థలకు కూడా మెసేజ్‌లు వెళ్తున్నాయి. భారీ వర్షాలు వచ్చే ప్రదేశాల్లో వరద నీరు చేరే ప్రదేశాలు, ట్రాఫిక్ జాం అయ్యే ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత ప్రభుత్వ విభాగాలను అప్రమత్తం చేస్తున్నారు. అవసరాన్ని బట్టి ఆయా ప్రాంతాల్లో ఉండే కమ్యూనిటీ సీసీ కెమెరాలను సైతం పరిశీలనలోకి తీసుకుని ప్రజలను అప్రమత్తం చేసే సరి కొత్త యంత్రాంగం అమల్లోకి వచ్చింది. జూలైలో ఈ అలెర్ట్ విధానం హైదరాబాద్‌లో అమల్లోకి రాగా తాజా జిల్లాలోకి అమల్లోకి వచ్చినట్లయింది. అలెర్ట్ మెసేజ్‌కు తగ్గట్టే బుధవారం మధ్యాహ్నం జిల్లాలో పలు చోట్ల ఓ మోస్తరు వర్షాలు కురిశాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత

- పశువైద్య శాఖలో 69 పోస్టులు ఖాళీ
- మూగజీవాలకు సక్రమంగా అందని వైద్యం
- ఏడాది కాలంగా భర్తీ చేయని ఉన్నతాధికారులు



అసిస్టెంట్ డైరెక్టర్ లేని పాల్వంచ ఏరియా పశుసంవర్ధకశాఖ ఆస్పత్రి

పాల్వంచరూరల్: పశుసంవర్ధక శాఖను సిబ్బంది కొరత వేధిస్తోంది. దీంతో పశువులకు సక్రమంగా వైద్యసేవలు అందడంలేదు. జిల్లాలో 2018–2019 లెక్కల ప్రకారం పశుసంపద 4.55 లక్షలు ఉన్నాయి. ఇందులో తెల్లపశువులు 2.80 లక్షలు, నల్లపశువులు (గేదెలు) 1.70లక్షలు, మేకలు 2.50 లక్షలు, గొర్రెలు 2.60 లక్షలు, నాటుకోళ్లు 1.38 లక్షలు, పందులు 3,180, కుక్కలు 30వేలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 80 పశువైద్యశాలలు ఉండగా, వీటిలో ఆరు ప్రాంతీయ పశువైద్యశాలలు, 30 ప్రాథమిక పశువైద్యశాలలు, 44 పశువైద్యశాలల ఉపకేంద్రాలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా అధికారులు, సిబ్బంది కలిపి 219 మంది ఉండాలి. కానీ ప్రస్తుతం 150 మంది మాత్రమే ఉన్నారు. మరో 69 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాల్వంచ పట్టణంలోని ఏరియా పశు వైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్ ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఇన్‌చార్జితో నెట్టుకొస్తున్నారు.

పశువైద్యంపై ప్రభావం

వెటర్నరీ శాఖలో ఖాళీ పోస్టులు ఏడాది నుంచి భర్తీ చేయడంలేదు. సిబ్బంది కొరతతో జిల్లాలోని పశుసంపదపై ప్రభావం పడుతోంది. పశువులు, గేదెలు అనారోగ్యం బారిన పడి సకాలంలో వైద్యసేవలు అందక మృత్యువాత పడుతున్నాయి. ఫలితంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పశుసంవర్ధక శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఖాళీ పోస్టుల వివరాలు

హోదా	మొత్తం పోస్టులు	ప్రస్తుతం ఉన్నది	ఖాళీలు
డిప్యూటీ డైరెక్టర్	1	1	0
అసిస్టెంట్ డైరెక్టర్లు	8	6	2
వెటర్నరీ అసిస్టెంట్లు	30	28	2
ఆఫీస్ సూపరింటెండెంట్లు	2	2	0
సీనియర్ అసిస్టెంట్లు	6	4	2
జూనియర్ అసిస్టెంట్లు	10	10	0
టైపిస్ట్	1	1	0
లైవ్‌స్టాక్ ఆఫీసర్లు	10	5	5
జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లు	18	14	4
లైవ్ స్టాక్ అసిస్టెంట్లు	24	24	0
వెటర్నరీ అసిస్టెట్లు	23	11	12
ఎన్యూమరేటర్	1	1	0
వెటర్నరీ వ్యాక్సినేటర్లు	14	3	11
డ్రైవర్లు	2	1	1
ఆఫీసు అటెండర్లు	69	39	30
	219	150	69

ప్రతిపాదనలు పంపాం



జిల్లాలోని పశువైద్యశాలలో ఖాళీగా ఉన్న సిబ్బంది భర్తీ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే ఎక్కడా రైతులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. – ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్యాధికారి

పోస్టులు భర్తీ చేయాలి



పశువైద్యశాలలో ఖాళీగాఉన్న పోస్టులను సకాలంలో భర్తీ చేయక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఖాళీగా పోస్టులను భర్తీ చేయాలి. – గంధం నర్సింహారావు, కేశవాపురం

పశువులకు వైద్యం కరువైంది



పశుసంవర్ధక శాఖలో అనేక సంవత్సరాలుగా ఖాళీ పోస్టులను భర్తీ చేయడంలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సిబ్బందిని నియమించాలి. – నాగిరెడ్డి, రెడ్డిగూడెం

మహిళా శక్తికి ప్రతీక.. ఐలమ్మ

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్య సాహసంతో పోరాడిన చాకలి ఐలమ్మ మహిళా శక్తికి ప్రతీకగా నిలిచారని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, శ్రామిక జన విముక్తి కోసం ఐలమ్మ చాటిన పోరాటపటిమ నేటి తరాలకు స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శ్రీలత, బీసీ సంఘం నాయకులు అజితకుమార్, ముదిగొండ రాంబాబు, సర్వేష్, జంగంపల్లి రాజు, దురిశెట్టి కుమార్, విజయలక్ష్మి, కొదుమూరి సత్యనారాయణ, కాపర్తి వెంకటాచారి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

17 నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం)/చుంచుపల్లి: మహిళల ఆరోగ్యం సక్రమంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యవంతంగా నిలుస్తుందనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం స్వాస్థ్ నారీ–స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో స్వాస్థ్ నారీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని రకాల ఆరోగ్య కేంద్రాల్లో సమగ్ర ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు. మారిన జీవనశైలి కారణంగా అనేక వ్యాధుల బారిన పడుతున్నారని, శిబిరాల్లో వ్యాధుల నిర్ధారణ జరిగితే తగిన చికిత్స, అవసరమైన మందులు అందించవచ్చని పేర్కొన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ, శక్తిమంతమైన కుటుంబ నిర్మాణం, సమాజాభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీఎంహెచ్ఓ జయలక్ష్మి, డీసీహెచ్ఓ రవిబాబు, డీపీఓ చంద్రమౌళి, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనినా, మున్సిపల్ కమిషనర్‌లు సుజాత, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రికార్డుల తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ విద్యాచందన

మణుగూరు రూరల్: మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని మెప్మా కార్యాలయాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఎం.విద్యాచందన బుధవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. మెప్మా ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం తోగ్గూడెంలోని సర్క్యులేటరీ ఆక్వా సిస్టం, కొర్రమీను చేపల పెంపకం కేంద్రం, కూనవరంలో మునగ తోటను సందర్శించారు. మునగ సాగు వల్ల రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఆ తర్వాత మున్సిపాలిటీ పరిధిలోని ఐకేపీ సంఘాల గోదాంను, ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల సభ్యులకు దసరా కానుకగా అందించే చీరల పంపిణీ వ్యవస్థను పరిశీలించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఐకేపీ, ఎన్ఆర్ఈజీఎస్ కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, ఎంపీఓ పి వెంకటేశ్వరరావు, అహ్మదుల్లా పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ మధుసూదన్ రావు

పాల్వంచ: విద్యుత్ అంతరాయాలను తగ్గించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వినియోగ దారులకు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్) టి.మధుసూదన్ రావు సూచించారు. బుధవారం జెన్‌కో ట్రైనింగ్ సెంటర్‌లో విద్యుత్ సరఫరా–అంతరాయాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ అంతరాయాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, విద్యుత్ నియంత్రికల నిర్వహణ, విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్‌లు, ప్రమాదాల నివారణపై తీసుకుంటున్న కార్యక్రమాలు, వినియోగదారులకు, రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది రక్షణ పరికరాలు ఉపయోగించాలని సూచించారు. ఎల్‌సీ యాప్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకుని విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ రాజు చౌహాన్, జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

దమ్మపేట: భార్య మీద హత్యాయత్నం చేసిన భర్తపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఏపీలోని ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం సోములపాలేనికి చెందిన మునీశ్వరికి మండలంలోని తాటిమల్లప్పగుంపునకు చెందిన వాడే బుజ్జిబాబుతో వివాహం జరిగింది. భర్త ప్రవర్తన సరిగాలేదని మునీశ్వరి గతంలోనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. అప్పటి నుంచి ఆమె భర్త నుంచి వేరుగా పుట్టింట్లోనే ఉంటోంది. దీంతో భార్యపై పగ పెంచుకున్న బుజ్జిబాబు బుధవారం మండలంలోని గండుగులపల్లి ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్ ఎదుట పిల్లల కోసం వేచి చూస్తున్న భార్య మునీశ్వరిపై కొడవలితో దాడి చేశారు. దీంతో మెడపై, కుడి చేతికి గాయాలై రక్తస్రావం జరిగింది. చికిత్స నిమిత్తం ఆమెను ఏపీలోని జంగారెడ్డిగూడెం తరలించారు. బాధితురాలి సోదరి పోడియం సుంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

ఇంకుడుగుంతలో పడి చిన్నారి మృతి



తల్లిదండ్రులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్

సత్తుపల్లిరూరల్: ఇంటి ఆవరణలో ఉన్న ఇంకుడు గుంతలో పడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం సత్యంపేటలో చోటుచేసుకుంది. మండలంలోని రుద్రాక్షపల్లి పంచాయతీ సత్యంపేట గ్రామంలో సోయం శివ, సంధ్యారాణి దంపతుల సంవత్సరం వయసు గల కుమార్తె మోక్షదుర్గ.. మంగళవారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటూ మూతలేని ఇంకుడుగుంతలో పడింది. కుటుంబ సభ్యులు గమనించకపోవడంతో కొద్ది సేపటికి చిన్నారి మృతి చెందింది. ఆ తర్వాత చిన్నారి కోసం వెదుకుతుండగా ఇంకుడుగుంతలో మృతదేహం కనిపించింది. కాగా, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్‌విజయ్‌కుమార్ బుధవారం సత్యంపేటకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి చిన్నారి మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పాఠశాలలకు ప్రోత్సాహకాలు

- జాతీయస్థాయిలో ఎంపికైన పాఠశాలలకు రూ. లక్ష నగదు
- స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్‌తో సర్కారు స్కూళ్ల ఎంపికలు
- 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారుల వెల్లడి



కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రత, అభివృద్ధి, విద్యార్థుల నైపుణ్యం, హరిత వాతావరణం ప్రమాణికాలుగా రేటింగ్, నగదు ప్రోత్సాహకం ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. స్వచ్ఛ హరిత విద్యాలయ రేటింగ్ పేరుతో దేశవ్యాప్తంగా 200 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి ఒక్కో స్కూల్‌కు రూ.లక్ష నగదును ప్రోత్సాహకంగా అందించనున్నారు. సంబంధిత ఉపాధ్యాయులను మూడు రోజులపాటు దేశవ్యాప్త విహార కేంద్రాల సందర్శనకు తీసుకెళ్లనున్నారు.

ఇవీ అర్హతలు..

గతంలో స్వచ్ఛ పురస్కారాలు అందజేసే వారు. ప్రస్తుతం రేటింగ్ పేరుతో పురస్కారాలు అందించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సమాజంలో శుభ్రతపై అవగాహన పెంచడం, పాఠశాల ప్రాంగణాన్ని పచ్చదనం వైపు మలచడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, వ్యర్థాలను వర్గీకరించడం, నీటి వినియోగంలో మితవ్యయం పాటించడం, వర్షపునీటి సేకరణకు ఏర్పాట్లు, విద్యార్థుల్లో పర్యావరణ స్నేహపూర్వక అలవాట్లను పెంపొందించడం, స్వచ్ఛ విద్యాలయం, మరుగుదొడ్ల శుభ్రత, తాగునీటి సదుపాయం, తరగతి గదుల శుభ్రత, దినసరి పరిశుభ్రత కార్యక్రమాలు, పాఠశాలల్లో మొక్కల పెంపకం, విద్యుత్ పొదుపు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్న పాఠశాలలను పరిశీలించి రేటింగ్ ఇవ్వనున్నారు. అర్హతలున్న పాఠశాలలు ఈ నెల 30 లోగా దరఖాస్తులను అందజేయాలి. జిల్లాలో అర్హతలు కలిగిన పాఠశాలలు ఎక్కువగానే ఉన్నాయని, ఆయా పాఠశాలలన్నీ దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులు తెలిపారు.

రేటింగ్ పద్ధతి..

0–50 మార్కులు: ఒక నక్షత్రం
51–74 మార్కులు: రెండు నక్షత్రాలు
75–80 మార్కులు: మూడు నక్షత్రాలు
81–89 మార్కులు: నాలుగు నక్షత్రాలు
90–100 మార్కులు: ఐదు నక్షత్రాలు

కేటగిరీలు ఇలా...

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, సబ్బుతో చేతులు కడగడం, వినియోగం, నిర్వహణ, ప్రవర్తన మార్పు, సామర్థ్య నిర్మాణం, జీవన శైలిలో మార్పులు, పాఠశాలల్లోని నిర్మాణాలు, మరుగుదొడ్లు, నీటి వసతి, హరితావరణం, వ్యర్థాల నిర్వహణ, ఆరోగ్యకర వాతావరణం వంటి కేటగిరీలలో రేటింగ్ ఇవ్వనున్నారు. జిల్లాలో మొత్తం 1,685 పాఠశాలలు ఉన్నాయి. డీఈఓ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు 1,081, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలు 310, సోషల్ వెల్ఫేర్ 09, మైనారిటీ వెల్ఫేర్ 07, బీసీ వెల్ఫేర్ 11, ఎయిడెడ్ 30, ప్రైవేట్ (అన్ ఎయిడెడ్) 223, జూనియర్ కళాశాలలు 14 ఉన్నాయి. ఇవన్నీ రేటింగ్ పరిధిలోకి రానున్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి ఆన్‌లైన్‌లోనే స్వీయ నివేదికలు సమర్పించాలి. రేటింగ్‌లో మెరుగైన పాఠశాలలకు జాతీయ స్థాయిలో ఎంపిక చేస్తారు. రూ. లక్ష ప్రోత్సాహక బహుమతి అందిస్తారు. రేటింగ్ ప్రక్రియలో పాల్గొనే పాఠశాలల ఆవరణ అందంగా పచ్చదనం, పరిశుభ్రతతో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

–బి. నాగలక్ష్మి, జిల్లా విద్యాశాఖాధికారి

బాధ్యత పెరుగుతుంది

గతంలో స్వచ్ఛ విద్యాలయ పురస్కార్ పేరుతో ఈ అవార్డులను ఇచ్చేవారు. ఈ సంవత్సరం నుంచి స్వచ్ఛ, హరిత విద్యాలయ రేటింగ్ పేరుతో అమలు చేస్తున్నారు. అవార్డుల వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో పాఠశాల పట్ల బాధ్యత పెరుగుతుంది. సమాజంలో స్వచ్ఛ భారత్ –హరిత భారత్ లక్ష్యాల సాధనకు తోడ్పడుతుంది.

–ఎస్‌కే సైదులు, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి

కోలాహలంగా 'కేటీపీఎస్' ఎన్నికలు

84.94 శాతం పోలింగ్



పాల్వంచలో బారులుదీరిన ఉద్యోగులు



మణుగూరులో పోలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

పాల్వంచ/మణుగూరురూరల్: కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఉద్యోగుల క్రెడిట్ సొసైటీ (పాల్వంచ) ఎన్నికలు బుధవారం కోలాహలంగా జరిగాయి. కేటీపీఎస్ కాలనీలోని డీఏవీ పాఠశాలలో పోలింగ్ కేంద్రంలో 2,100 మంది సభ్యులకు 1,728 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మణుగూరులోని బీటీపీఎస్ ఎస్పీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 500 మంది ఉద్యోగస్తులకు గాను 450మంది ఓటు వేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని వైటీపీఎస్‌లో 396 మంది ఓటర్లకుగాను 367 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ఆకర్షించేలా ఫ్లకార్డులు, కరపత్రాలు, గుర్తులను సూచిస్తూ అభ్యర్థులు సందడి చేశారు. పోటీలో ఉన్న 37 మంది డైరెక్టర్ అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల వద్ద ఉద్యోగులను కలుస్తూ తమకే ఓటు వేయాలని అభ్యర్థించారు. సొసైటీలో మొత్తం 2,996 మంది ఓటర్లు ఉండగా, 2,545మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం84.94శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. పోలీస్, ఎస్పీఎఫ్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కొనసాగుతున్న టిమ్ డ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న టిమ్ డ్రైవర్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో టిమ్ డ్రైవర్లు చేపట్టిన నిరసన మూడో రోజు బుధవారం కూడా కొనసాగింది. 42 మంది టిమ్ డ్రైవర్లు విధులు బహిష్కరించి ఆందోళనలో పాల్గొంటున్నారు. దీంతో అధికారులు 10 సర్వీసులను తగ్గించారు. ఫలితంగా వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు యూనియన్ల నాయకులు జేఏసీగా ఏర్పడి, టిమ్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని డీఎం తిరుపతిని కోరారు. లేదంటే సమ్మె ఉధృతం చేస్తామని చెప్పారు. భద్రాచలానికి డిపోనకు చెందిన టిమ్ డ్రైవర్ నాగరాజు పని ఒత్తిడితో అనారోగ్యానికి గురైన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తోటి డ్రైవర్లు తెలిపారు. కాగా భద్రాచలం డిపోలో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ (ఎస్‌డీఐ)గా విధులు నిర్వహిస్తున్న పోకల సురేష్ తన పోస్టుకు మంగళవారం రాత్రి రాజీనామా చేశారు.

యూరియా పక్కదోవ పట్టిందని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

పాల్వంచ: కో ఆపరేటివ్ సొసైటీ సిబ్బంది యూరియా బస్తాలను పక్కదోవ పట్టించారని ఆరోపిస్తూ రైతులు ఆందోళన చేపట్టారు. బుధవారం సొసైటీ కార్యాలయం నుంచి నుంచి 15 బస్తాల యూరియాను ఆటోలో ఎక్కించి మహబూబాబాద్‌కు పంపించే ప్రయత్నం చేస్తుండగా స్థానిక రైతులకు అనుమానం వచ్చి ఆందోళన చేపట్టారు. యూరియా కోసం వచ్చిన వ్యక్తి స్థానికుడు కాదంటూ వాగ్వాదానికి దిగారు. అధికారుల తీరును నిరసిస్తూ బీసీఎం రహదారిపై నిరసన తెలిపారు. దీంతో సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ సుమన్‌లు అక్కడికి చేరుకుని ఆటోను స్టేషన్‌కు తరలించారు. రైతులను శాంతింపజేశారు.

ఆత్మకమిటీ టెక్నికల్ అసిస్టెంటే సూత్రధారి?

యూరియా బస్తాల అక్రమ తరలింపునకు ఆత్మకమిటీ టెక్నికల్ అసిస్టెంట్ సూత్రధారి అని అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. బుధవారం అతని తండ్రి ఓ ఆటోను పాల్వంచ సొసైటీకి పంపించగా, బిల్లులు లేకుండా 15 యూరియా బస్తాలో ఆటోలో ఎక్కించాడు. రైతులు గమనించి ఆందోళన చేపట్టడంతో పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీంతో అప్పటికప్పుడు సదరు వ్యక్తి కార్యాలయం నుంచి బయటకు వెళ్లి దొంగ బిల్లులు సృష్టించి తప్పును కప్పిపుచ్చే ప్రయత్నం చేసినట్లు సమాచారం. సిబ్బంది సహకారంతో టెక్నికల్ అసిస్టెంట్ అక్రమంగా యూరియా తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై సీనియర్ అసిస్టెంట్ లక్ష్మిని వివరణ కోరగా.. యూరియా బస్తాలను స్లిప్‌ల ప్రకారం ఇచ్చామని, అవి ఎక్కడికి తీసుకెళుతున్నారనే విషయం తమకు సంబంధం లేదన్నారు. ఎస్ఐ సుమన్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. అందుబాటులోకి రాలేదు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతు సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, ఐక్యూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుమ్మడి నర్సయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాగర్ విమర్శించారు. సంయుక్త కిసాన్ మోర్చా, జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో శేషగిరిభవన్‌లో బుధవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారంచెల్లించాలని కోరారు. నాయకులు చంద్ర నరేంద్రకుమార్, అమర్లపూడి రాము, సలిగంటి శ్రీనివాస్, బుర్రా వెంకన్న, బానోత్ ఊశ్లా, కోరం వెంకటేశ్వర్లు, కట్ట నాగయ్య, బొప్పన హరిబాబు, నిమ్మల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలి



బాలికలతో మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్ రాజ్

మణుగూరు టౌన్/అశ్వాపురం: విద్యార్థినులకు చదువుతోపాటు పౌష్టికాహారం అందించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్ట్ అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. బుధవారం మణుగూరు మండలంలోని గుట్ట మల్లారంలో గిరిజన సంక్షేమ గురుకుల బాలికల, జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు. వంటగది, సామగ్రి, స్టోర్ రూంలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి మెనూ అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. విషకీటకాలు సంచరించే అవకాశం ఉన్నందున రాత్రివేళ బయటకు రావొద్దని విద్యార్థులకు చెప్పారు. జీసీసీ కార్యాలయం నుంచి బియ్యం సరఫరాలో జాప్యం జరుగుతోందని ఉపాధ్యాయులు తెలుపగా, వెంటనే అధికారులతో మాట్లాడారు. కొందరు విద్యార్థులు వైరల్ ఫీవర్‌తో బాధపడుతుండగా పీహెచ్‌సీ వైద్యులతో మాట్లాడి చికిత్స అందించారు. అశ్వాపురం రైతువేదికలో నిర్వహించిన ఆది కర్మయోగి అభియాన్ పథకంలో భాగంగా నిర్వహించిన గ్రామస్థాయి అధికారుల శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పథకాలు గిరిజనులకు అందేలా మండల లెవల్ కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మామిళ్లవాయి, తుమ్మలచెరువు, పాములపల్లి, గొందిగూడెం గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి పథకాల గురించి వివరించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పలు అంశాలపై తహసీల్దార్‌తో చర్చించారు. ఆ తర్వాత తహసీల్దార్ డేవిడ్‌రాజును సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నిర్లక్ష్యం తగదు

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న కాంతారావు

మణుగూరు రూరల్: కోటి ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించిందని, ఆ ప్రాజెక్ట్‌పై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం తగదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. బుధవారం బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం కూలిపోతుందంటూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన కమిషన్ కావాలనే తప్పుడు నివేదికలను ప్రకటించిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లల్లో రూ.3 లక్షల కోట్ల అప్పులు చేసి ప్రాజెక్టుల నిర్మాణానికి పెట్టుబడిగా పెడితే, 20 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2.50లక్షల కోట్లకు పైగా అప్పు చేసి ఒక్క ప్రాజెక్టు కూడా నిర్మించలేదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు కావాలనే కుట్రలు పన్నుతున్నాయని, రానున్న రోజుల్లో ప్రజలే ఆ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

అసత్య ఆరోపణలు మానుకుని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, పోశం నర్సింహారావు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్, వట్టం రాంబాబు,నూకారపు రమేష్, వేర్పుల సురేష్, అక్కి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం అన్వేషణ!

అశ్వారావుపేట: అశ్వారావుపేటలో కొందరు గుప్త నిధుల కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు పగటి వేళల్లో లాడ్జిల్లో బస చేస్తూ, అర్ధరాత్రి వేళలో తవ్వకాలను జరిపే ప్రాంతాలను అన్వేషించేందుకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు గుప్తనిధుల ముఠాఓ కమాండర్ జీప్‌లో సంచరిస్తున్నట్లు సమాచారం. మండలంలో పలు గ్రామాల్లో జీప్ తిరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని అశ్వారావుపేట ఎస్ఐ యయాతి రాజు దృష్టికి తీసుకువెళ్లగా.. రాత్రిళ్లు తిరిగే వాహనాలు, వ్యక్తులపై నిఘాపెడతామన్నారు. గుప్తనిధులు వంటి ప్రచారాలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఊకే ప్రసాద్(ఫైల్)

కరకగూడెం: మండలంలోని చిరుమల్ల రాయనిపేట గ్రామ సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా, బుధవారం గుర్తించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు పాలకమ్మతోగు గ్రామానికి చెందిన ఊకే ప్రసాద్ (35)గా గుర్తించారు. గతంలో తల్లిదండ్రులు మృతి చెందగా, భార్య కూడా వదిలివెళ్లిందని బంధువులు తెలిపారు. కుటుంబ సమస్యలు, ఒంటరితనం, మద్యం అలవాటు కారణంగా తీవ్ర మనస్తాపం ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్సై పీవీఎస్‌రావు కేసు నమోదు చేశారు.

ఎల్సిరెడ్డిపల్లిలో వ్యక్తి..

పినపాక: మండల పరిధిలోని ఎల్సిరెడ్డిపల్లి పంచాయతీ డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో నివాసముంటున్న చెంచు వీరబాబు (40) పవర్ ప్లాంట్‌లో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధసాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడికి ముగ్గురు పిల్లలు కాగా భార్య ఎనిమిది సంవత్సరాల క్రితమే మృతి చెందింది. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ సురేష్ తెలిపారు.

పాల్వంచలో ఆర్టిజన్ కార్మికుడు..

పాల్వంచ: ఆర్టిజన్ కార్మికుడి ఆత్మహత్యపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పాత పాల్వంచ గడియ కట్టకు చెందిన కేటీపీఎస్ గ్రేడ్–4 ఆర్టిజన్ రెండేళ్లుగా గుండె సంబంధ సమస్యతో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో గత మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా పాత పాల్వంచ డౌన్‌లో బీసీఎం రోడ్ పక్కన పురుగుల మందు తాగి పడిపోయి ఉన్నాడు. ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతుడి భార్య శివలక్ష్మి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేశారు.

పిడుగుపాటుతో ముగ్గురు కూలీలకు అస్వస్థత

టేకులపల్లి: వరి చేనులో పని చేస్తున్న ముగ్గురు వ్యవసాయ కూలీలు బుధవారం పిడుగు పాటుతో అస్వస్థతకు గురయ్యారు. మండలంలోని ప్రెగళ్ల పాడు పంచాయతీ తూర్పుగూడెం గ్రామానికి చెందిన ఈసం రాజమ్మ, కొడెం పాపమ్మ, గొగ్గెల శిరీష గ్రామం సమీపంలోని స్టేషన్‌బేతంపూడి గ్రామంలో వరి పొలంలో కలుపు తీసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం భారీ వర్షంతోపాటు వరి పొలంలో పిడుగు పడటంతో కూలీలు స్పృహ కోల్పోయి అస్వస్థతకు గురయ్యారు. వారిని రైతులు సమీపంలోని పీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు.

పిడుగుపాటుకు కూలిన పోర్టికో



రాఘవాపురంలో పిడుగుపాటుకు కూలిన పోర్టికో

సుజాతనగర్: మండలంలో బుధవారం సుమారు 3 గంటలపాటు భారీవర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాఘవాపురంలో తెల్లబోయిన పెద్ద శ్రీను ఇంటి పోర్టికో పిడుగు పాటుతో కూలిపోయింది. ఆర్ఐ కాంతారావు పరిశీలించి సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. వర్షం ప్రభావంతో మండల కేంద్రం చెరువును తలపించింది.

దొంగలకు దేహశుద్ధి

పాల్వంచరూరల్: కిన్నెరసాని వాగు ఒడ్డున, పంట పొలాల వద్ద ఉన్న వ్యవసాయ విద్యుత్ మోటార్లను చోరీ చేస్తున్న ఇద్దరు దొంగలను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. మండలంలోని నాగారం గ్రామ శివారులో వ్యవసాయ విద్యుత్ మోటార్లతోపాటు ద్విచక్రవాహనాల ఇంజన్లను చోరీ చేస్తుండగా మంగళవారం రాత్రి స్థానికులు ఇద్దరిని పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. మరో నిందితుడు పారిపోయాడు. నిందితులు బూర్గంపాడు పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు తేలడంతో వారిని బూర్గంపాడు పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఐ సురేష్ బుధవారం తెలిపారు.

సైబర్ కేసు నమోదు

దమ్మపేట: దమ్మపేట పోలీసు బుధవారం సైబర్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ... మండలంలోని లచ్చాపురం గ్రామానికి చెందిన కంపాటి చిలకమ్మ(32) సెల్‌ఫోన్‌కు కొద్దినెలల క్రితం తక్కువ పెట్టుబడితో అధికంగా లాభాలు అర్జించవచ్చంటూ ఓ మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె పలు దఫాలుగా రూ.2,80,000 ఓ యాప్‌లో పెట్టుబడిగా పెట్టింది.

లాభాలు రాకపోవడంతో గత నెల 16న ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో పోలీసులు మోసగాళ్ల బ్యాంకు ఖాతాలో రూ.80,264ను స్తంభింపజేశారు. బాధితురాలు బుధవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.